# నమస్తే తెలంగాణ
## మహబూబాబాద్
5 | బుధవారం 1 మే 2024 | MAHABUBABAD


# కేసీఆర్ రోడ్‌షోను సక్సెస్ చేయండి

**ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలి**
**ఎమ్మెల్సీలు సత్యవతి, రవీందర్‌రావు, ఎంపీ కవిత**

మహబూబాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మహబూబాబాద్ రోడ్‌షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపీ కవిత నివాసంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ బుధవారం సాయంత్రం 6గంటలకు జిల్లాకు చేరుకుంటారని, మహబూబాబాద్ లోకసభ పరిధిలోని నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో పేదల కష్టాలను తీర్చేందుకు అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలుచేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, హామీల అమలులో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని తెలిపారు. కేసీఆర్ రోడ్‌షోకు 70వేల మందిని తరలించనున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి తప్పు చేశామని, పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి సరిచేసుకోవాలని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. తప్పకుండా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత భారీ మెజార్టీతో గెలుస్తుందని సత్యవతి ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మహబూబాబాద్ రోడ్‌షోలో డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట నియోజకవర్గాలు, ములుగు నియోజకవర్గంలోని కొన్ని మండలాల ప్రజలు పాల్గొంటారని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ముందు నుంచి ర్యాలీ ప్రారంభమై ఇందిరాగాంధీ సెంటర్ వద్దకు చేరుకుంటుందని వివరించారు. సాయంత్రం 6గంటలకు కేసీఆర్ రోడ్ షోలో బస్సు పైనుంచి ప్రసంగిస్తారని తెలిపారు. ఉద్యమనేత కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారని, వాస్తవాలు గ్రహించిన ప్రజలు కాంగ్రెస్‌ను బొందపెట్టి, బీఆర్‌ఎస్‌ను గెలిపించనున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. మానుకోట ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, కేసీఆర్ రాక కోసం ప్రజలు, మహిళలు, యువకులు, రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేద్దామని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో పుట్టిన ఆడబిడ్డ, ఇక్కడి ప్రజలను పేరు పెట్టి పిలిచే, ప్రజల కష్టాల్లో తోడుండే, అందుబాటులో ఉండే, అభివృద్ధి చేసే తనను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, చిత్రంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎంపీ కవిత

**మానుకోట గులాబీ మయం..**

ఉద్యమనేత కేసీఆర్ రోడ్‌షో సందర్భంగా మానుకోట పట్టణమంతా గులాబీమయమైంది. అన్ని కూడళ్లను గులాబీ జెండాలు, తోరణాలతో ముస్తాబు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గతేడాది అక్టోబర్ 27న మహబూబాబాద్ ప్రచారంలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం బుధవారం మానుకోటకు వస్తుండడంతో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. మానుకోట పార్లమెంట్‌కు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మొదటి జాబితాలోనే సీటు దక్కించుకున్న మాలోత్ కవిత గెలుపు కోరుతు బీఆర్‌ఎస్ శ్రేణులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులతో పోలిస్తే బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు ప్రజల్లో మంచి పేరుంది. బుధవారం బీఆర్‌ఎస్ అధినేత రోడ్‌షోతో కవిత భారీ మెజార్టీతో గెలుస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తంచేస్తున్నారు.







# నేడు మానుకోటకు గులాబీ దళపతి

## ఇందిరాగాంధీ సెంటర్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో

మహబూబాబాద్, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ) : గులాబీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బుధవారం మానుకోట జిల్లాలో పర్యటించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహిస్తున్న ఆయన ఇవాళ మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరాగాంధీ సెంటర్‌లో రోడ్‌షోలో పాల్గొననున్నారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎన్నికల సంగ్రామంలో కార్యోన్ముఖులను చేసే లక్ష్యంతో ఈ యాత్ర తలపెట్టగా బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేయనున్నారు. రోడ్‌షోను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు విశేష కృషిచేస్తున్నారు. బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నయాజోష్ నింపి, ఈ ఎన్నికల్లో పార్టీని విజయతీరానికి నడిపించేందుకు బస్సుయాత్ర దోహదపడుతుందని పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.



రూట్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

### రూట్‌ను పరిశీలించిన నేతలు

గులాబీ బాస్ కేసీఆర్ బుధవారం మహబూబాబాద్‌లో పర్యటించనున్న నేపథ్యంలో బస్సుయాత్ర రూట్‌ను మంగళవారం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మానుకోట మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్నలు పరిశీలించారు. పట్టణ శివారులోని ధరణి హాస్పిటల్, వ్యవసాయ మార్కెట్ కూడలి, మథర్ థెరిస్సా సెంటర్, వివేకానంద సెంటర్, నర్సంపేట బైపాస్ రోడ్‌తో పాటు జిల్లా దవాఖాన, నెహ్రూ సెంటర్, ఇందిరాగాంధీ సెంటర్లను బీఆర్‌ఎస్ నేతలు పరిశీలించి ఇందిరాగాంధీ సెంటర్‌ను ఫైనల్ చేశారు.

### ఘన స్వాగతానికి ఏర్పాట్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఇల్లెందు, బయ్యారం మీదుగా మానుకోట పట్టణంలోకి ప్రవేశించనున్నారు. మానుకోట పట్టణంలో బుధవారం సాయంత్రం కేసీఆర్ రోడ్‌షో ప్రారంభమై రాత్రి వరకు కొనసాగనున్నది. కొత్తగూడెం నుంచి బస్సుయాత్ర నేరుగా జిల్లా దవాఖాన వద్దకు చేరుకుంటుంది. అక్కడినుంచి నెహ్రూ సెంటర్ మీదుగా ఇందిరాగాంధీ సెంటర్‌కు చేరుకుంటుంది. జిల్లా దవాఖాన నుంచి బస్సుయాత్రతో పాటు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొననున్నారు. ర్యాలీ సందర్భంగా కేసీఆర్‌కు ఘన స్వాగతం చెప్పేందుకు డప్పుచప్పుళ్లతో పాటు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బోనాలు, బతుకమ్మలతో మహిళలు స్వాగతం పలుకనున్నారు. ఈ సందర్భంగా దారి పొడవునా కేసీఆర్ ప్రయాణించే బస్సుపై పూలవర్షం కురిపించేందుకు శ్రేణులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మానుకోటలో రోడ్‌షోలో పూర్తయిన తర్వాత కేసీఆర్ నేరుగా హనుమకొండ హంటర్‌రోడ్డులోని కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంట్లో బస చేయనున్నారు.






# పది ఫలితాల్లో మెరిసిన జనగామ

- 98.16శాతంతో రాష్ట్రంలో నాలుగో స్థానం
- 22వ స్థానానికి పరిమితమైన వరంగల్
- సత్తాచాటిన 'సర్కారు' విద్యార్థులు



జనగామ చౌరస్తా, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో జనగామ జిల్లా 98.16 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానం సాధించింది. జిల్లావ్యాప్తంగా 6,692 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఇందులో 3,076 మంది బాలురు, 3,493 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 97.59 కాగా, బాలికల ఉత్తీర్ణత శాతం 98.67 నమోదైంది. జిల్లాలోని 182 ఉన్నత పాఠశాలల్లో 4 బీసీ వెల్ఫేర్ పరిధిలో ఉన్నాయి. కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్, మైనార్టీ రెసిడెన్షియల్, రెండు సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఐదు జడ్పీహెచ్‌ఎస్‌తో పాటు 19 ప్రైవేట్ పాఠశాలలతో కలిపి మొత్తం 35 స్కూళ్లలో 133మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. 108 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలదే పైచేయిగా నిలిచింది. గతేడాది వెలువడిన ఫలితాల్లో జిల్లా పదో స్థానంలో నిలువగా, ఈసారి నాలుగో స్థానానికి ఎగబాకింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ టాప్‌గా నిలిచి విద్యారంగ నిపుణుల ప్రశంసలు అందుకుంది. కాగా, ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు డీఈవో రాము శుభాకాంక్షలు తెలిపారు. అలాగే 95.99శాతం ఉత్తీర్ణతతో హనుమకొండ జిల్లా 10వ స్థానం, 94.60 శాతంతో మహబూబాబాద్ 12వ స్థానం, 94.45శాతంతో ములుగు 13వ స్థానం, 92.96శాతంతో భూపాలపల్లి 16వ స్థానం, 92.20 శాతంతో వరంగల్ 22వ స్థానానికి పరిమితమైంది.


# బీజేపీ వస్తే రిజర్వేషన్లు ఖతం

- రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అద్వానీ రథయాత్ర చేశాడు
- సరిహద్దు సైన్యాన్ని తెచ్చినా రిజర్వేషన్లకు అండగా ఉంటాం
- రేగొండ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ)/ రేగొండ : బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఉండవని.. రిజర్వేషన్లను కాలరాసే బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో మంగళవారం పరకాల, భూపాలపల్లి నియోజకవర్గ స్థాయి జనజాతర సభ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై బీజేపీపై నిప్పులు చెరిగారు. బీజేపీ 400 సీట్లు కావాలని కోరుకుంటున్నదని, అదే జరిగితే రిజర్వేషన్లు ఉండవన్నారు. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను అమలు చేసిందని, దళితులను, గిరిజనులను అనేక మందిని ఉన్నత స్థాయికి చేర్చిందన్నారు. 1978లో బీసీ, ఓబీసీలకు కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ కల్పించిందని, 52శాతం బీసీ, ఓబీసీలు ఉన్నారని, వారికి 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని అప్పటి రాష్ట్రపతి నియమించిన మండల్ కమిషన్ రికమండ్ చేసిందన్నారు. 1990లో రిజర్వేషన్లను అమలు చేయగా అద్వానీ ఆ కమిషన్‌కు వ్యతిరేకంగా రథయాత్ర చేసి పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్లగా బీసీ జనాభా లెక్కించి రిజర్వేషన్ అమలు చేయాలని పిలుపునిచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు అమ లు చేస్తామని, బీజేపీ వస్తే రిజర్వేషన్లకు మంగళం పాడుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ అండగా ఉంటుందని, సరిహద్దు సైన్యాన్ని తెచ్చినా వెనకాడేది లేదని రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. పదేళ్లు ప్రధానిగా ఉన్న మోదీ బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీ కారిడార్, ఐఐటీ ఇవ్వలేదని, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేదని, మామునూరు ఎయిర్‌పోర్టును అడ్డుకున్నారన్నారు. ఇవి తెలంగాణ పౌరుషానికి, గుజరాత్ పెత్తనానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేగొండలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి





## నిప్పులకొలిమి

వాజేడు : మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా జగన్నాథపురం వై జంక్షన్

**గరిష్ఠంగా వాజేడులో 45.6 డిగ్రీలు**

వాజేడు/మహదేవపూర్, ఏప్రిల్ 30 : ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఉదయం ఎనిమిది అయ్యిందంటే చాలు సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. పది దాటితే చాలు బయటకు వెళ్లలేని పరిస్థితి. మంగళవారం ఉమ్మడి వరంగల్‌లో గరిష్ఠంగా ములుగు జిల్లా వాజేడు మండలంలో 45.6 డిగ్రీలు నమోదు కాగా, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో 43 డిగ్రీలుగా ఉంది. నిత్యం జనంతో రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, రహదారులు ప్రజలు లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. మండుతున్న ఎండల కారణంగా వడదెబ్బ గురయ్యే ప్రమాదం ఉన్నందుకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు.

### మహదేవపూర్‌లో వడదెబ్బతో ఒకరి మృతి

మహదేవపూర్, ఏప్రిల్ 30 : వడదెబ్బతో మహదేవపూర్ మండలకేంద్రానికి చెందిన కొత్తవడ్ల శంకర్(35) మృతిచెందాడు. సోమవారం పని నిమిత్తం బయటకు వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా మంగళవారం ఉదయం చనిపోయాడు.